నగరంలో నేడు.. రేపు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హన్మకొండ / ఖిలా వరంగల్ : నగర వ్యాప్తంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్ అధికారులు తెలిపారవు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున ఈనెల 9న వరంగల్ నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పోతన, దేశాయిపేట, కేఎంసీ, పోచమ్మమైదాన్, మామునూర్, ఉర్సు, శంభునిపేట, స్టేషన్ రోడ్డు, ఖిలా వరంగల్, ఏజే మిల్స్, గొర్రెకుంట, స్తంభంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

హసన్‌పర్తి: మరమ్మతుల కారణంగా చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. కేసీ క్యాంప్, నారాయణ నగర్, ఎర్రగట్టు గుట్ట, కిట్స్ ఏరియా, హసన్‌పర్తి, రామారం, భీమారం చింతగట్టు, కోమటిపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

ఎంజీఎం: ప్రజాకవి పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు 109వ జయంతిని పురస్కరించుకుని కెమిస్ట్, డ్రగ్గిస్ట్ భవన్‌లో శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వద్దిరాజు రాకేష్, ఏబీటీపీఏ అధ్యక్షుడు మోతుకూరు మనోహర్ రావు తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీఎస్‌పీ కార్యాలయం ప్రారంభం

హన్మకొండ: ధర్మ సమాజ్ పార్టీ ప్రాంతీయ కార్యాలయాన్ని ఈనెల 9న ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్ తెలిపారు. హనుమకొండ విద్యుత్‌నగర్ (విష్ణుప్రియ గార్డెన్ సమీపం)లో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని శనివారం మధ్యాహ్నం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ ప్రారంభిస్తారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు చాకలి ఐలమ్మ వర్ధంతి

కాజీపేట అర్బన్: వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని ఈనెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాంరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు 31వ డివిజన్ న్యూశాయంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలో ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.


11న బీజేపీ బూత్‌స్థాయి సమ్మేళనం

మడికొండ: ఈనెల 11వ తేదీన నిర్వహించనున్న వర్ధన్నపేట నియోజకవర్గ బూత్‌స్థాయి సమ్మేళనాన్ని విజయంతం చేయాలని బీజేపీ నాయకుడు జలగం రంజిత్ పిలుపునిచ్చారు. 44, 45, 46, 64వ డివిజన్ల ముఖ్య కార్యకర్తల సమావేశం మడికొండలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో నాయకులు పానగోటి వెంకట్‌రావు, డివిజన్ల అధ్యక్షులు ముత్తోజు సురేష్, దామెరుప్పుల రమేష్, చెన్నబోయిన శివ, గడ్డం మహేందర్, ఎలగొండ శివ, కిరణ్, బైరపాక వెంకటేష్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

16న బొజ్జా తారకం వర్ధంతి

హన్మకొండ: ప్రజా ఉద్యమ నాయకుడు, హక్కుల నేత, న్యాయవాది, బహుజన ఉద్యమ నిర్మాత బొజ్జా తారకం 7వ వర్ధంతి సభను ఈనెల 16న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి జన్ను సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 16నుంచి 30వ తేదీ వరకు బొజ్జా తారకం వర్ధంతి సభలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ 16న హైదరాబాద్‌లో, 24న నర్సంపేటలో, 30న హనుమకొండలో వర్ధంతి సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి సభలను విజయవంతం చేయాలని కోరారు.

17న మెగా జాబ్‌మేళా



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఈనెల 17న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వరంగల్ దేశాయిపేట రోడ్డులోని ఒయాసిస్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను విద్యార్థులు, అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమర కోట జంక్షన్‌లో బీజేపీ నేత కొప్పు క్రాంతి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. వేల్పుల నందు, శ్రీను, ఇనుముల రాజు, అంకాల జనార్దన్, చిరంజీవి, రమేష్, నరేష్ పాల్గొన్నారు.

19న గద్దర్ సంస్మరణ సభ

నయీంనగర్: ఈనెల 19న సాయంత్రం ఖిలా వరంగల్ (పడమర కోట) చమన్ సెంటర్‌లో నిర్వహించనున్న ప్రజా యుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభను విజయవంతం చేయాలని భారత్ బచావో వ్యవస్థాపకుడు గాదె ఇన్నయ్య, గద్దర్ మిత్రులు కోరారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గాజర్ల అశోక్, సతీష్, క్రాంతి, అనిల్‌కుమార్, రాథోడ్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన నిత్యావసరాల ధరలు తగ్గించాలి

ఖిలా వరంగల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి దండు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో కార్యకర్తలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నేతలు గన్నారపు రమేష్, ఎలేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్, ఎండీ.అక్బర్ పాషా, జాన్‌పాల్, నల్లతీగల కుమార్, రాములు, యాకాంబర చారి, రాజేందర్, సుంకరి భవాని, నవంబీ, సౌందర్య విజయలక్ష్మి, సువర్ణ, యాకూబ్, జన్ను రాజు, కుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో..

పోచమ్మమైదాన్ జంక్షన్‌లో నిరసన

ఎంజీఎం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించేలా చర్యలు చేపట్టకపోతే రానున్న ఎన్నికల్లో పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సీపీఐ వరంగల్ మండల కార్యదర్శి బుస్సా రవీందర్ హెచ్చరించారు. పెరిగిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ పోచమ్మమైదాన్ జంక్షన్‌లో సీపీఐ నాయకులు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ నిత్యావసర సరకులైన ఉప్పు, పప్పు నూనెల వంటి నిత్యావసర వస్తువులపై అధిక జీఎస్టీ విధిస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రవి, గుండె బద్రి, కండి నర్సయ్య, సంద్ర కుమార్, జన్ను రవి, ఎండీ.అంజాద్, బచ్చల స్వప్న, మస్కా సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



వరంగల్ అర్బన్: మాట్లాడుతున్న నాయకులు



కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూసీ అధ్యక్షుడు బరుపట్ల మహేష్ పిలుపునిచ్చారు. గ్రేటర్ మున్సిపల్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్నాలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులతో పాటు జీడబ్ల్యూఎంసీ జేఏసీ, టీ మేవా, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, తదితర సంఘాల నాయకులు పాల్గొంటారని మహేష్ తెలిపారు.

హసన్‌పర్తిలో కరపత్రాల ఆవిష్కరణ

హసన్‌పర్తి: బల్దియాలో పనిచేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య డిమాండ్ చేశారు. ఈనెల 11న నిర్వహించనున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల మహాధర్నా కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. హసన్‌పర్తి, గుండ్లసింగారం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మికులకు రూ.21వేలు వేతనం అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై ప్రజలకు అవగాహన

హన్మకొండ చౌరస్తా: స్వచ్ఛంద సంస్థల కృషితోనే నేత్ర, అవయవ దానంపై ప్రజల్లో చైతన్యం కలిగిందని, దాంతో దానం చేసేందుకు చాలామంది ముందుకు వస్తున్నారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. హనుమకొండలోని జిల్లా గ్రంథాలయంలో సెమినార్ హాల్‌లో 38వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల ముగింపు సమావేశం శుక్రవారం జరిగింది. సదాశయ ఫౌండేషన్, తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో అజీజ్ ఖాన్ మాట్లాడారు. అవయవ దానంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శైలజాదేవి, సదాయశ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, ప్రగల్లపాటి ఫౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, విద్యా ఫౌండేషన్ అధ్యక్షుడు బిల్లా మహేందర్, సంస్థ ప్రతినిధులు సాగంటి మంజుల, రవీందర్, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బాధ్యులు

ధర్నాలు చేస్తే కఠిన చర్యలు

వరంగల్ క్రైం: ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ హెచ్చరించారు. ఏదైనా కార్యక్రమం చేయాలనుకుంటే పోలీసుల నుంచి ముందుస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు.

విదేశాలకు పార్సిల్ సర్వీస్



ఏర్పాటు చేసిన పార్సిల్ సర్వీస్ కేంద్రం

ఖిలా వరంగల్: తపాలాశాఖ వరంగల్ డివిజన్‌లో విదేశాలకు పార్సిల్ సర్వీస్ కేంద్రం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా వరంగల్ డివిజన్ తపాలాశాఖ సూపరింటెండెంట్ నర్సంహస్వామి హాజరై డాక్ ఘర్ నిర్యత్ కేంద్ర సర్వీస్‌ను ప్రారంభించి మాట్లాడారు. తమ ఇంటి వద్ద నుంచే విదేశాలకు పార్సిల్‌ను పంపించుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి, పోస్ట్‌మాస్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

బీజేపీ టికెట్‌కు రాకేష్‌రెడ్డి దరఖాస్తు

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిత్వానికి ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి దరఖాస్తు చేశారు. వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు చెల్లించుకుని నాయకులు, కార్యకర్తలతో 50 వాహనాలతో భారీ కాన్వాయ్‌తో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. నాంపల్లిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో దరఖాస్తు స్వీకరణ కమిటీ సభ్యులకు దరఖాస్తు అందించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మడికొండ: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. మడికొండలోని నెహ్రూనగర్‌లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మడికొండ: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తా..

హసన్‌పర్తి: చౌదరికుంట కట్టపై ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. ఎమ్మెల్యే రమేష్‌ను భగీరథ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం శుక్రవారం కలిసి సన్మానించింది. ఈ సందర్భంగా ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేయగా, ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. భగీరథ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోడెం వెంకట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కందుకూరి చంద్రమోహన్, కోశాధికారి పోతరాజు సారంగపాణి, గౌరవ సలహాదారులు మండల భిక్షపతి, మద్ది భిక్షపతి, పాపిశెట్టి కోటిలింగం, ఉపాధ్యక్షులు గాజుల మోహన్, గాలిబు రాజేందర్, ఇనుగాల పెద్దిరెడ్డి, సూర్యప్రకాష్, సత్యం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేత

హసన్‌పర్తి: ఓ దివ్యాంగురాలు చేసిన ట్వీట్‌కు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ స్పందించారు. ఈమేరకు ఆ దివ్యాంగురాలి ఇంటికి వెళ్లి వీల్ చైర్ అందజేశారు. హసన్‌పర్తి మండలం సిద్ధాపురానికి చెందిన శ్రీలత పుట్టుకతో దివ్యాంగురాలు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



రేణుకను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికై అవార్డు పొందిన పింగిళి కళాశాల బయాలజీ విభాగాధిపతి డాక్టర్ రేణుకను వడ్డేపల్లిలోని పింగిళి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమౌళి మాట్లాడుతూ ఉత్తమ బోధనాతీరుతో రాష్ట్రస్థాయి అవార్డు పొందిన రేణుకను అధ్యాపకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. గతంలో ఏడుగా ఉన్న పీజీ విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 50కి చేరిందని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసిని, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ పార్వతి తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడు భిక్షపతికి అభినందన

ఖిలా వరంగల్: ఈనెల 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డును విద్యానగర్ కాశికుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన భిక్షపతి అందుకున్నారు. ఈమేరకు విద్యానగర్ కాశికుంట ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ స్కూల్ ప్రాంగణంలో హెచ్‌ఎం రాంజీ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, హేమలత, వాణి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలి



అభివాదం చేస్తున్న అఖిలపక్ష నాయకులు

కాశిబుగ్గ: ఈనెల 18నుంచి 22 వరకు కొనసాగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను మధుకర్ అధ్యక్షతన ప్రతాప్‌నగర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం అఖిల పక్ష నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన మాటను బీజేపీ విస్మరించిందని విమర్శించారు. సమావేశంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కార్పొరేటర్ వస్కుల బాబు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మంద రాజు, తెలంగాణ ద్రావిడ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూసల శ్రీకాంతాచారి, తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్, ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

ఖిలా వరంగల్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌సీసీ కేడెట్లకు వరంగల్ ఫైర్ స్టేషన్ ఆఫీసర్ శ్రీనివాసరావు సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండల మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ వరంగల్ కమాండెంట్, కల్నల్ అజయ్‌నంద కందూరి ఆధ్వర్యంలో 8రోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని వరంగల్ ఫైర్ స్టేషన్ సిబ్బందితో కలిసి అధికారి శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేడెట్లకు ఆయన అవగాహన కల్పించారు. కెప్టెన్ డాక్టర్ సదానందం, జీవన్, రాధాకృష్ణ, రాజయ్య, సుహాస్ కదం, సారస్య, సందీప్‌యాదవ్, రాజమాణిక్యం, వెంకటేష్, అనిల్, శశాంక్, సతీష్‌గౌడ్ ముక్బుల్ బాషా, ఇజాజ్, షబ్బీర్ పాల్గొన్నారు.



జాగ్రత్తలు వివరిస్తున్న ఫైర్ అధికారులు

సంక్షిప్తంగా

బీసీల సింహగర్జనను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: ఈనెల 10న హైదరాబాద్ సరూర్‌నగర్ మైదానంలో జరగనున్న బీసీల సింహగర్జనకు విజయవంతం చేయాలని బీసీ సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నే రవీందర్ పిలుపునిచ్చారు. ఈమేరకు వరంగల్ శంభునిపేట విశ్వనాథకాలనీలో బీసీల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభకు వరంగల్ జిల్లా నుంచి వేలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, చల్లమల్ల సత్యనారాయణ, సదానందం, వాసుదేవ్, మల్యాల శ్రీనివాస్, కారుపోతుల రాజు, భరత్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం..

కేయూ క్యాంపస్: ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ అధ్యాపకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నట్లు కేయూ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ చిర్ర రాజుగౌడ్ తెలిపారు. కేయూలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ వేల్పుల కుమార్, వర్కింగ్ అధ్యక్షుడు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ ఉపేందర్ రావును ఓయూ పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని తెలిపారు. వారిని వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాలు బంద్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంటాక్ట్ టీచర్స్ జేఏసీ కోకన్వీనర్ డాక్టర్ వెంకట గోపీనాథ్, డాక్టర్ రాధిక, డాక్టర్ మంతిని శంకర్, డాక్టర్ స్వామి చాడా, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సాంబశివుడు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం సలహాదారుడు డాక్టర్ అంజన్ రావు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ఎదుట రిలే నిరాహార దీక్షల శిబిరంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. దీక్షలకు డాక్టర్ అనిల్‌కుమార్, వాణి, సంతోష్‌కుమార్, కాంట్రాక్ట లెక్చరర్ల సంఘం చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ విద్యాసాగర్, ఆర్‌డీ.ప్రసాద్, బ్రహ్మయ్య, నాగయ్య, కల్పన, సత్యజాల, భిక్షపతి రాజేశ్వరి, చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు.

బీజేపీ నాయకుల ర్యాలీ

మామునూరు: మేరీ మట్టి.. మేరీ దేశ్‌లో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ కోరారు. అమృత్ మహోత్సవంలో భాగంగా వరంగల్ శంభునిపేటలో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ర్యాలీ పెరకవాడలోని రేణుక ఎల్లమ్మ గుడి వరకు సాగింది. ఈ సందర్భంగా ఇంటింటికి కరపత్రాలను అందజేస్తూ దేశంపై ప్రేమను పెంచుకోవాలని ప్రజలకు సూచించారు. కనుకుంట్ల రంజిత్, వన్నాల వెంకటరమణ, శ్రీనివాస్, బైరి నాగరాజు, గోనె రాజయ్య, జనార్దన్, సుదర్శన్ అమంత శ్యామ్ పాల్గొన్నారు.

శ్వేతార్కలో శ్రావణ శుక్రవారం పూజలు



కాజీపేట: శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలోని మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిపించారు. భక్తులతో అర్చకుడు సాయికృష్ణశర్మ అష్టోత్తర పూజలు చేయించారు. వరలక్ష్మి వ్రతం ఆచరించడం వల్ల కలిగే పుణ్యఫలాన్ని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ, భద్రకాళి దేవస్థానం ఆస్థాన పండితులు అనంతమల్లయ్య శర్మ వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మడికొండ: 46వ డివిజన్ బుడిగజంగాల కాలనీలో రూ.కోటి వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ మునిగాల సరోజన శుక్రవారం శంకుస్థాన చేశారు. కార్యక్రమంలో మునిగాల కరుణాకర్, డివిజన్ అధ్యక్షుడు బొల్లికొండ వినోద్, వల్లెపు ఉపేందర్, గాండ్ల భిక్షపతి, కుమార్‌బాబు, కుమార్‌రాజ, అబ్బసాయిలు, వస్కుల దేవేందర్, రాసమల్ల రాజు, దుబాసి పద్మరావు, కాశేశ్వరపు రాజేందర్, రాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నాణ్యతతో నిర్మించాలి

ఖిలా వరంగల్: సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని కార్పొరేటర్లు సిద్దం రాజు, వేల్పుగొండ సువర్ణ సూచించారు. వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీ కాయిత బ్రాహ్మణ వీధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు, 37వ డివిజన్ పడమరకోటలో జరుగుతున్న బాక్స్ డ్రెయినేజీ పనులను కార్పొరేటర్లు శుక్రవారం వేర్వేరుగా పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో బోగి సురేష్, మీరిపెల్లి రాజు, మేకల ఎల్లయ్య, నలిగంటి నవీన్, అభిషేక్, నిఖిల్, ముటికే నరేష్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో వ్యాసరచన పోటీలు



హన్మకొండ: కాళోజీ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీచైతన్య పాఠశాలలో చిమ్మపూడి ఫౌండేషన్, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, భాషా సేవా సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలుగు భాష ఔన్నత్యంపై శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పుస్తకాలు, బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ భాషా, స్కూల్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, జోనల్ అకాడమిక్ కోఆర్డినేటర్ మహేష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గీతారాణి, శ్రీనివాసచారి, శిరీష పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేస్తాం

వరంగల్: తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ రజక దోబీ అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లెంగుల సుకుమార్, జిల్లా అధ్యక్షుడు అశోక్‌పవన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈమేరకు రాష్ట్ర నాయకుల అనుమతి పొందినట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కాజీపేట: కాజీపేటలో పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ శుక్రవారం ఆహ్వానించారు. కార్యక్రమంలో రంజిత్ కుమార్, కాటపురం రాజు, అయ్యాల దానం, సుంచు కృష్ణ, శివకుమార్, బస్వా యాదగిరి, ఫర్హాన్, పాము రాజేష్, రాజేందర్ పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



చిన్నికృష్ణుడి ఊయల ఊపుతున్న భక్తులు

హన్మకొండ కల్చరల్: గురువారం రాత్రి ప్రారంభమైన శ్రీకృష్ణాష్టమి వేడుకలను శుక్రవారం తెల్లవారుజాము వరకు నిర్వహించారు. హనుమకొండలోని గోదామాధవ ఆధ్యాత్మిక ప్రచార కేంద్రంలో ఆరుట్ల శ్రీనివాసాచార్య స్వామి ఆధ్వర్యంలో ఉదయం ఆపదుద్ధారక స్వామికి అభిషేకం, అలంకరణ పూజలు నిర్వహించారు. రాత్రి 11గంటల నుంచి జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శ్రీకృష్ణుడికి విశేష అభిషేకం అలంకరణ, భాగవతంలోని దశమస్కంధం పారాయణం, విష్ణు పురాణ పారాయణం చేశారు.

ఇస్కాన్ దేవాలయంలో వ్యాస పూజ

శ్రీకృష్ణ జనాష్టమి వేడుకల్లో భాగంగా వరంగల్ ములుగురోడ్డులోని ఇస్కాన్ దేవాలయంలో ఇస్కాన్ సొసైటీ ఆచార్యులు శ్రీలప్రభుపాదల వారి వ్యాస పూజను శుక్రవారం నిర్వహించారు. ఉదయం రాధా నీలమాధవలకు, జగన్నాథస్వామి, సుభద్ర, బలరాములకు ప్రత్యేక అలంకరణ పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

ప్లాట్‌ఫాం - 65 ప్రథమ వార్షికోత్సవం

కాజీపేట అర్బన్: కాజీపేట నిట్ ప్రాంతంలోని ప్లాట్‌ఫాం – 65 వరంగల్ బ్రాంచ్ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాట్‌ఫాం – 65 యాజమాన్యం మాట్లాడుతూ రైలు నేపథ్యంలో రూపొందించిన ప్లాట్‌ఫాం – 65 రెస్టారెంట్‌లో టాయ్ ట్రైన్‌లు టేబుల్ వద్దకే ఫుడ్‌ను అందించడంతో నగరవాసులను ఆకట్టుకుంటున్నట్లు వివరించారు. ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా 200 రకాల స్టార్టప్‌లతో స్టార్టప్స్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్నట్లు వివరించారు. వెజ్ అండ్ నాన్ వెజ్ స్టార్టప్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు హ్యాపీ అవర్ డిస్కౌంట్లు, కాంప్లిమెంటర్ కేక్‌తో సమావేశాలు నిర్వహించుకునే అవకాశం, ప్రైవేట్ డైనింగ్ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్లాట్‌ఫాం – 65 సీజీఎం శ్రీకాంత్ బండారు, ఎండీ సుద్దున్ పాథా, దిల్‌షుక్‌నగర్ ఈడీ శ్రీనివాస్, వరంగల్ బ్రాంచ్ ఈడీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ వార్షికోత్సవంలో యాజమాన్యం, సిబ్బంది

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖిలా వరంగల్: అనారోగ్యానికి గురై చికిత్స చేసుకునేందుకు చేతిలో డబ్బులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో మనోవేదన గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ టి.సురేష్ తెలిపారు. ఎల్కతుర్తి మండలం కేశవపురం గ్రామానికి చెందిన కడిపికొండ సంధ్య – మధు దంపతులు బతుకుదెరువు నిమిత్తం కొంతకాలంగా వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిలనగర్‌లో నివాసం ఉంటూ కూలీపని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మధు (50) అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ఈనెల 7న క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో పద్మావతి ఫర్నిచర్ షాపు సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శుక్రవారం లభ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు.

202 మందికి ఉద్యోగావకాశాలు



కాజీపేట: కాజీపేట మండలం సోమిడి శివారులోని నేతాజీ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్‌లో 202 మందికి పైగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు దక్కాయి. ఫార్మా స్యూటికల్ ఇండస్ట్రీ ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి తుది పరీక్షలో ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. క్యాంపస్ సెలక్షన్స్‌ను కళాశాల చైర్మన్ అశోక్ రెడ్డి ప్రారంభించగా, కంపెనీ ప్రతినిధులు రాకేష్ కుమార్, వెంకటరెడ్డి, కట్కూరి నవీన్ కుమార్, కిరణ్, సీహెచ్.జైపాల్ రెడ్డి, ఆదిరెడ్డి పాల్గొని విద్యార్థులను ఇంటర్వ్యూ చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రాకేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ బాబురావు పాల్గొన్నారు.